# "జిజ్ఞాస"

అయిపోయింది. అంతా అయిపోయింది. ఏ అనుభవాలు ఆ పసిపిల్లను అంత విజ్ఞానవతిగా చేశాయో, ఆ అనుభవాలే ఆ పిల్లను చావు కంత దగ్గరగా తీసుకు వచ్చాయి. తన చేతులలో పెరిగి, అనుభవాల పుట్టగా మారి తనకే గురువయిన తన అన్నకూతురు బరువైన ప్రాణం అతి తేలికైన అనంత వాయువుల్లో కలిసిపోయిందీ నాడు.

అంతగా ఆలోచించి అనుపమ ఏమి మిగుల్చుకోగలిగింది? ఆమె మృతదేహం చుట్టూ చేరి కన్నీళ్ళు కార్చే ఈ ప్రజాసీకం సానుభూతి మిగుల్చుకుందా? ఆమె జ్ఞాపకాలు ఎవళ్ళ హృదయాల్లో ఎన్నిరోజులు పదిలపరచ బడతాయి?

చిటికి దూరాన, అతి దూరాన మిట్టలో నాగాళ్ళు ముడుచుకుని కూర్చున్న అతనికి, తనకు దూరంగా, చిటికి దగ్గరగా, మరీ దగ్గరగా ఏడుపు వినిపిస్తోంది.

"నాన్నా, అమ్మ కావాలి!" వెక్కి వెక్కి ఏడుస్తున్న కంఠం. ప్రతిబిడ్డా కోరే అతి సామాన్యమైన కోరిక.

"నాకూ కావాలి, పాపా! అమ్మ నాకూ కావాలి. కానీ... కానీ... తిరిగి రాదు. తిరిగి రాదిక." పసిపిల్లవానిలా కూతురును పెనవైచుకొని ఏడుస్తున్న శబ్దం. అది కొన్ని సంవత్సరాల క్రితం పరిచయమయిన స్వరం, తాగుడు మైకంలో గతి తప్పిన ఒకనాటి స్వరం.

చుట్టూ పొగ. దానికి వెనక ముసక మసగ్గా మనుష్యులు. కపాలం బ్రద్దలయిన శబ్దం. కదలిపోతున్న బంధువుల కాలూరు సిడలు. ఆ తగవాలి అంతా నిశ్శబ్దం. ఆ భయంకరమైన నిశ్శబ్దంలో అతనికి, ఉన్నట్టుండి ఏదో కొత్తగా గుర్తువచ్చినట్లయింది.

"నిజం! ఇక అనుభవం తిరిగి రాదు. కష్టాలలోను, సుఖాలలోనూ తనను పెనవ్వంటి, అతి భయంకరమైన నిజాలు చెప్పే అనుభవం ఇక తిరిగిరాదు. తనను 'బాబాయ్!' అని అతి ప్రీతిగా పిలవడానికి తన అన్నకూతురు ఇక లేదు" సర్వం పోగొట్టుకున్న ఆ బాటసారి కళ్ళనిండా ముత్యాల్లాంటి నీళ్ళు జారిపోతున్నాయి.

"బాబాయ్!" ఎక్కడినుండో పిలుపు.

"అతి సామాన్యమైన ఆ చావుకు అతి దీర్ఘంగా ఆలోచిస్తున్నావేమిటి బాబాయ్!"

తన భుజాలమీద చల్లటి వేళ్ళ స్పర్శ. అందిన వాత్సల్య పూరితమైన ఆ వేళ్ళను పట్టుకోవాలని ఆరాటం. కాని, అంతా భ్రమ. వేడి కన్నీళ్ళు, అంతకంటే వేడిగా ఉన్న భుజాలమీద చల్లగా తగిలాయి.

'అమ్మా, తల్లీ!' నిట్టూర్చాడతను. కాలగ్రంథంలోని తనకు తెలిసిన అనుపమ తాలూకు రెండు పుటలను మననం చేసుకుంటూ నడవసాగాడతను. శ్మశానానికి దూరంగా, ఊరికి దగ్గరగా.

• • •

తల్లి పోయినప్పుడు అందరూ ఏడుస్తుంటే మూడేళ్ళ పసికూన అయిన అనుపమ బెదరలేదు. బాబాయి దగ్గరకు పరుగు పరుగున వచ్చి కుతూహలంగా అడిగింది.

"ఎందుకు బాబాయ్, అందరూ ఏడుస్తున్నారు?"

వదిన స్మృతులు కలవరపెడుతూ వుండగా, ఆ పిల్లను, హృదయానికి అదుముకుని చెప్పాడు.

"మీ అమ్మ ఇంక తిరిగిరాదు, అనూ!"

ఆపిల్ల కొద్దిసేపు మాట్లాడలేదు. బాబాయ్ చేతుల్లో నుండి తప్పించుకుని తన లేతవేళ్ళతో అతని కన్నీళ్ళను తుడుస్తూ అంది:

"పోనీలే బాబాయ్!" ఆమె కనుపాపల్లో తన నీడ చూసుకొని ఉలిక్కిపడ్డాడతను. చావు పుట్టుకల రహస్యం అంతా తనకు తెలిసిపోయినట్టు ఒక్క మాటలోనే చెప్పిన తన అన్నకూతురు వంక చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత ఆమె దగ్గర అలా ఆశ్చర్యపోయిన క్షణాలు చాలా ఉన్నాయి.

తన గుండెలమీద చేరి కథలువింటూ ముఖం చిట్లించి వెంటనే ఫక్కున నవ్వింది పదేళ్ళ అనుపమ ఒకరోజు.

"భలే, బాబాయ్! తమ్ముణ్ణీ, భార్యనూ కష్టాలు పెట్టి మొత్తానికి మంచిపేరు సంపాదించుకున్నాడు శ్రీరాముడు."

"అదేమిటి! తండ్రిమాట కోసం శ్రీరాముడు కానలకు వెళ్ళాల్సి వచ్చింది. మాటమీద నిలబడ్డ అతను దేవుడమ్మా..." సీతకి బోధించాలని అతని ప్రయత్నం.

ఆ పిల్ల నవ్వు ఆపి అంది:

"కాదు బాబాయ్! తన తండ్రి అసమర్థుడు. సవతల్లి ద్వేషంతో కోరరాని కోరిక కోరింది. అటువంటప్పుడు నిజం తెలియచెప్పాలి కానీ, చెప్పినదే తడవు అలా పారిపోతే ఎలాగ? చూడు, శ్రీరాముడి మూలానివల్ల గదా పాపం, దశరథ మహారాజు చనిపోయాడు? సీతమ్మ తల్లికి అన్ని కష్టాలు వచ్చాయి?"

ఆ పిల్ల కళ్ళనిండా సీతమ్మమీద ఎనలేని సానుభూతి.

అలా తన గుండెలమీద కూర్చుని కథలు వింటున్న అనుపమ హఠాత్తుగా పెరిగిపోయింది.

"అప్పుడప్పుడు ఎందుకు, బాబాయ్ ఇంత అసంతృప్తి నిరాశా అకారణంగా కలుగుతాయి?"

"ఈ జీవితంలో సంతృప్తి పడకుండా ఇంకేదో జీవితం కావాలని ఆరాటపడతాను. ఇంకొక తమాషా ఏమిటంటే, బాబాయ్ ఈ ఆనందమైన క్షణం జారిపోతుందనే

ఆవేగంతో అనుభవం తాలూకు మధుర స్మృతులను దాచు
కోవటమే మరిచిపోతున్నాం."

ఆమె చెప్పేదానికి తన్మయతతో వింటున్నాడతను
ఆమెకీ శిక్షా సంస్కారాలు ఎవరు బోధించారు?

పద్నాలుగు సంవత్సరాల వయస్సులో మహా కవు
లయిన లీలాశుకుడు, కాళిదాసు, భవభూతి, భారవి - ఆమె
మేధలో తారాడారు. మహాగాయకుడయిన త్యాగరాజు
తాన్‌సేన్ ఆమెకు ఆరాధ్యులయినారు. క్షేత్రయ్య, దీక్షితుల
శ్యామశాస్త్రిగారల భావాలు ఆమె మనసులో చోటు చేసు
కున్నాయి.

అర్ధరాత్రి కట్టు బట్టలతో, భార్యా బిడ్డలను వది
కానల కేగిన, గౌతమ బుద్ధుడంటే ఆమెకు సానుభూ
మెండు.

"బుద్ధుడు స్వార్థపరుడు కాదంటావా, నువ్వు?"

బాబాయి ప్రశ్నకు రెండు నిమిషాలు ఆలోచిం
జవాబు చెప్పిందామె.

"స్వార్థం కాదు బాబాయ్! అమితంగా ప్రేమించే
భార్యను, బిడ్డను వదిలిపెట్టి వెళ్ళాలంటే అది గొప్ప త్యా
మే అవుతుంది. కాని, అప్రయత్నంగా కలిగిన విరక్తిలో ఆ
త్యాగమో, స్వార్థమో కూడా గుర్తించే స్థితిలో లేడతని
తన సౌఖ్యాన్ని, శాంతిని, సమస్తాన్ని భార్యా బిడ్డల
చూచుకోగల అతను వాళ్ళను పోగొట్టుకొని భికారి అయ్యా

కాకపోతే చరిత్రలో నిలిచి పోయావు." అని నిట్టూర్చి "మంచి మమకారంకలవాళ్ళంతా చరిత్రకెక్కారు బాబాయ్" అంది.

మౌనంగా వున్న బాబాయిని చూస్తూ మరల తనే అంది.

"ఒక తమాషా చెప్పనా బాబాయ్? నాకొక స్నేహితురాలు ఉండేది. దానికి గడిచిపోయిన క్షణాల తాలూకు మచ్చ ఒకటి క్షణం క్షణం బాధిస్తుండేది. ఆ రహస్యాన్ని భర్తనుండి దాచుకోవడానికి అది చాలా అవస్థలు పడింది. అతను ఆ రహస్యం తెలిస్తే హింసిస్తాడనే భయంతో. అది దానిని అతి జాగ్రత్తగా దాస్తుందని నేననుకునే దానిని. కాని బాబాయ్! నాకు దాని ఆఖరి క్షణాల్లో అసలు నిజం తెలిసింది. అది కన్నుమూశాక అతనేం చేయలేడని తెలిసికూడా అది ఆ రహస్యాన్ని వెల్లడి చేయలేదంటే. దానికి మంచి మీద ఎంత మమకారమో చూడు! నిజం, బాబాయ్! ఆ మమకారమే లేకపోతే చాలామంది చెడ్డవాళ్ళే అయ్యేవారు."

ఎదిగి పోతున్న తన అన్న కూతురును కౌగిలించి కూర్చున్నాడతను. ఆమె చెప్పిన ప్రతిమాటలోనూ నిజం వుంది. కాని, ఆ నిజాలను ఆ పసిపిల్ల నోటివెంట అతనికి వినాలనిపించలేదు. మానసికంగా చాలా తొందరగా ఎదిగిపోతుం

ద్దామె. దానికి ఆనకట్ట వేయాలనే ప్రయత్నంతోనే ఒకరోజు ఆమె పార్టీకి తనతో వస్తానంటే అడ్డు చెప్పాడు.

"అది డ్రింకింగ్ పార్టీ తల్లీ! నువ్వు భరించలేవు, అమ్మా!"

"నన్నొకమారు చూడనీ బాబాయ్!" బాబాయిని బ్రతిమిలాడుకుని ఆయనతో బయలు దేరింది.

మొదట్లో చాలా సంస్కారయుతంగా, అతి నాగరికులుగా ఉన్న ఆ మనుష్యులు, తాగిన మైకంలో ఏమి మాటలాడుతున్నారో తెలియని స్థితిలో అడవి మనుష్యుల్లా ప్రవర్తిస్తుంటే జాలి పడింది. అన్ని విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాసతో బయలుదేరిన ఆమె, ఆ వాతావరణానికి సర్దుకోలేక పోయింది. తాగినంతసేపూ తాగి, వాంతి చేసుకొని, మంచా విశద్దంగా తెలివిలేని స్థితిలో పడిపోయిన వాళ్ళను చూసిన ఆమె హృదయం బాధతో నిండుకున్నట్లయింది. ఎందుకిలా జరిగింది? ఫలితం తెలిసి ఎందుకు తాగుతారు వీళ్ళు? నిండు గున్న గుండెలతో నీరసం ఆవరించింది ఆమెను. ఆ నీరసానికి ఉత్తేజానికి తట్టుకోలేక మూలకెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎవరికోసమో కన్నీరు కారుస్తున్న అన్న కూతురును, ఆశ్చర్యంగా జాలిగా చూస్తున్నాడతను.

'అనుపమ ఒక్కమారుగా అజ్ఞానంలో నుంచి విజ్ఞానంలోకి జొరబడటానికి చేసే ప్రయత్నంలో ఆ జిజ్ఞాసలో మనశ్శాంతిని పోగొట్టుకుంటోంది' అనుకున్నాడు మనసులో.

o o o

"బాగా ఆలోచించుకో తల్లీ!"

"ఏమి ఆలోచించను బాబాయ్!" ఆమె కళ్ళు రెపరెప లాడాయి.

"నిజం చెప్పాలంటే అతను నీకెందులోనూ సరిపోడు. అతను ఏమంత అందగాడు కాదు."

ఆమె సన్నగా నవ్వింది.

"నా ఊహా పథంలో సుందరుడూ, మనోహరుడూ అయిన ఒక వ్యక్తిని పురుషుణ్ని, నా పక్కన నిలబెట్టుకొని, క్షణాల్లో నా భావిజీవితాన్ని అందులో పొదిగి, అనుభూతి పొందిన మాట నిజమే, బాబాయ్! ఇప్పుడు అందులో ఏ ఒక్కటీ నిజం కాకపోయినా నేను చింతించడం కాని, నిరాశ పడడం కాని లేదు. ఎందుకంటే నా కానాడే తెలుసు- ఇవన్నీ ఊహలు మాత్రమేనని."

"పోనీ, అమ్మా! అటువంటివాడికోరకు నువ్వెందుకు వేచి వుండకూడదు? తొందర ఏముంది ఇందులో!"

ఆమె మాట్లాడలేదు కొద్దిసేపు అయ్యాక నిట్టూర్చి అంది.

"నా ఊహా పురుషుడు సాత్వికుడు కూడా! అందమూ సాత్వికతా ఒకచోట కలవడం చాలా అరుదు. నా కళ్ళల్లో ఆరాధనా పూర్వకంగా చూడగలిగినవాడు అందగాడు అయి వుండడని నా నమ్మకం."

"ఇంకొక విషయం బాబాయ్! వాళ్ళు ఎంత అందగాళ్ళయినా సరే, నన్ను ప్రేమించని వాళ్ళను నేను మనసారా ప్రేమించలేను. కాగా, అలా నటించాల్సి వచ్చినప్పుడు నేనెంత బాధపడతానో నువ్వు ఊహించావు." విరక్తిగా నవ్వి వినీ వినిపించనట్టు అంది.

"పోనీ బాబాయ్! అతని కళ్ళల్లో నా పట్ల వున్న ఆరాధన చాలు. ఈ జీవితాన్ని గడిపి వేయటానికి."

"ఆరాధించడమే కాదు, హింసించడం కూడా అతనికి వచ్చు."

"బాబాయ్!" ఉలిక్కిపడింది అనుపమ.

"నీకెలా తెలుసు, బాబాయ్?"

ఆమె స్వరంలోని మార్పుకు అతను విచలితుడయ్యాడు.

"అదికాదు. నా ఉద్దేశం అది కాదమ్మా! అతను తాగుతాడు. ఆ తాగుడు మైకంలో...."

ఆమె గట్టిగా గాలి పీల్చుకుంది. ఆనాడు అతని ముఖంలో ధీరత్వాన్నీ, సాత్వికతనూ ఏక కాలంలో చూడగలిగింది. ఆరాధనా పూర్వకమయిన అతని చల్లటి చూపులకు తన హృదయాన్ని పారపోసుకుంది. ఇప్పుడు అతనిని కాదనుకుని అశాంతిని భరించేకంటే, శారీరకమైన బాధ ననుభవించడం నయం. సంతృప్తి అన్నా మిగులుతుంది.

"తాగినపుడు అతను పసివాడితో సమానం. ఆ సమయంలో అతను ఎటువంటి ఘోరం చేసినా, ఆ ఘాతం అతి నెలో మరిచిపోతాడో, నేనూ అలాగే మరచిపోతాను. పోనీ, మరచిపోవాలి. అంతకంటే గత్యంతరం లేదు."

అతను తన గురువు, శిష్యురాలు అయిన అనుపమ గురించి ఆలోచిస్తున్నాడు.

"ఆనాడు పార్టీలో తాగిన వాళ్ళకోసం సానుభూతితో వెక్కి వెక్కి ఏడ్చిన ఆ పిల్ల, దీన్ని ఎలా భరించగలదు?"

'అనుపమ ఎరుగదు!' తనకు తాను సర్ది చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాడతను.

"పోనీలే, లల్లీ! నువ్వు తెలిసిన మలుపు ముందుగాని. నాకో నమ్మకముంది."

"అదేమిటి బాబాయ్, అలా అంటావు? ఎవరిని ఎవరు మటుకు మార్చగలరు?"

"అయితే..." తన అన్నకూతురు అంతర్యం ఆయనకు బోధపడలేదు. ఆమె చెప్పింది నెమ్మదిగా.

"సంశయం వద్దు బాబాయ్! నీ అనుమానం నాకు తెలుసు. నేను అతన్నిగాని నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను. అతను మారుతాడని ఆశతో నేను యీనాడు అంగీకరిస్తే... ఒకవేళ, నేను చివరివరకు భరించాల్సి ఉంటుంది."

"ఆ సంగతి నాకూ తెలుసు, అమ్మా లల్లీ!"

"థాంక్స్!" లేచింది ఆమె.

"నిరాశలోనూ, చెడులోనూ కూడా నన్ను సంతృప్తిని వెతుక్కోనీ బాబాయ్. నిరాశను ఆశగా, చెడును మంచిగా మార్చాలని పొందే తాపత్రయంలో కలిగే అశాంతికంటే ఇదే బాగుంటుంది కదూ బాబాయ్!"

• • •

"తమాషా చూడు, బాబాయ్! పొద్దుట పోస్ట్ అందుకున్నాను. అందులో ఆయన ఉత్తరం రాలేదని నిరాశ పడడం కూడా అలవాటైపోయింది. కాని, ఇప్పుడు సినిమానుండి తిరిగి వెళ్ళేసరికి, తలుపు సందులో ఆయన వ్రాసిన ఉత్తరం నా కెదురు పడుతుందని ఆశ."

"క్షణ క్షణం అతని తలపులే నీలో ఆ ఆశను కలిగిస్తాయి అనూ! అతని జ్ఞాపకాలనుండి నీకు విముక్తి లేదు. అంతే!"

"కాదు, బాబాయ్! నేనాయనను తలుచుకోని క్షణమే లేకపోతే సినిమాలో నేనెందుకు లీనమయ్యాను? ఆయన దూరగ్గాసం, నాకెందుకీ సుఖానుభూతులు? నేను గాఢంగా ప్రేమించేది ఆయనని భ్రమపడ్డాను. కాని, నిజానికి నేను ప్రేమించేది నా శరీరాన్ని, నన్నే, బాబాయ్!" ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"అనూ! పిచ్చి తల్లీ! ఏడుస్తున్నావా? ఇన్నాళ్ళకు అతనికొరకు నువ్వు పడ్డ బాధను కన్నీళ్ళలో కారుస్తున్నావా?"

"లేదు, బాబాయ్! ఈ జీవితం నాకర్థం కాకుండగా నన్ను భయపెడుతూంది. దానిని గూర్చి తెలుసుకోవాలనే తపన నాలో మిగిలిపోయింది. దానిని కనుక్కోవడానికి మార్గంలేదు. ఆ అశాంతి ఉప్పెనలా నన్ను దహించివేస్తుంటే ఏమీ చేయలేక మీరన్నట్లు స్త్రీని, అబలను - ఇంతకంటే ఏమి చేయలేక కన్నీళ్ళు కారుస్తున్నాను."

"ఎంత పొందినా ఈ పాపిష్టి మనసుకు సంతృప్తిలేదు. ఆయననుండి నేను పొందని వరంలేదు. ఇంకా ఆయననే నిందిస్తాను." ఆమె కంఠంలో కన్నీళ్ళు కదలాడాయి.

"ఇన్ని పుస్తకాలు చదివాను. ఎందులోనూ నాకు మహా సంతృప్తి మిగల్లేదు. ఇంకా శూన్యంగా ఏదో మిగిలి పోతూనే వుంది.

"వ్యామోహం మనిషి బ్రతుకును సర్వనాశనం చేస్తూంది. మహా కల్లోలం, యుద్ధం - ఒక చిన్న భూభాగం కొరకు. దానివల్ల ఎందరు అభాగ్యులవుతున్నారో! ఆ అభాగ్యులు ఎన్ని కన్నీటిబొట్లు రాలుస్తున్నారో ఊహించడానికి కూడా వ్యవధిలేని బ్రతుకులు."

"అజ్ఞాని అజ్ఞానిగా ఉండగానే, ముష్టివాడు ముష్టివాడుగా ఉండగానే శాస్త్రజ్ఞులు ఏదో ప్రగతి సాధించామని భుజాలెగరేస్తున్నారు. వాళ్ళను ... వాళ్ళను ఒక్కమారు చెయ్యిపట్టుకుని లాక్కొచ్చి, బలవంతంగా కళ్ళు తెరిపించి ఈ ప్రపంచాన్ని చూపించాలని వుంది."

ఆమె చెప్పుకుపోతోంది. అతను వింటున్నాడు.

"ఒక శాస్త్రజ్ఞుడు తను కనిపెట్టిన 'థియరీ' గురించి ఇచ్చిన ఉపన్యాసం తాలూకు గొంతు నొప్పి ఇంకా తగ్గకుండానే ఇంకొకడు అతనిది తప్పనీ, అసలు 'థియరీ' ఇదనీ ఇంకొకటి తెస్తాడు. దీనికి అంతూ ఆపూ లేదు. మనం పరుగులు తీస్తున్నామనుకుంటున్నాము. కానీ, ఒక్క అడుగు కూడా మనం ముందుకు పోవడం లేదు."

అతను ఆలోచిస్తున్నాడు. 'ఈ పసి పిల్ల వయసుకు మించి చూస్తోంది. ఆమె ఏమి ఆలోచిస్తుందో ఆమెకే సరిగా తెలియదు. మాటలకు, ఆలోచనలకు పొందిక లేదు. ఏదో తెలుసుకోవాలనే ఆరాటం మాత్రం ఉంది. అనుభవం లేని ఆలోచనలు ఆమెకు శూన్యాన్ని మాత్రమే మిగులుస్తున్నాయి. ఆ శూన్యాన్ని ఆమె భరించ లేకుండగా ఉంది. ఏమీ తెలియని ఆమెకు అన్నీ తెలుసుకోవాలనే తపన హఠాత్తుగా కలిగింది. కానీ, తెలుసుకోవడానికి ఆమె వయస్సు చాలడం లేదు. వయస్సు ఎదిగేవరకూ ఆలోచనలు ఆగడం లేదు. ఆ రెండింటికీ మధ్యఆమె నలిగి పోయింది.

'పిపాసిని అయిన స్త్రీకి శాంతి లేదు' నిట్టూర్చాడతను.

o o o

చేతులు జోడించి భగవంతుని నమస్కరిస్తున్న అనుపమ, తలుపు చప్పుడుకు ఇటు తిరిగింది.

"దేవుని ధ్యానించుకో, తల్లీ! నేను తరువాత వస్తాను.

"లేదు, లేదు. రా, బాబాయి! పర్వాలేదు."

"ఇంత చిన్న వయసులో నీకు ఎంత భక్తి తల్లీ!"

ఆమె నవ్వింది.

"భక్తి అంటే ఏమిటి, బాబాయ్?"

"ప్రతి నిత్యమూ భక్తిగా దేవుని పూజించే నీకు నాస్తికుడనైన నేను భక్తి గురించి బోధించాలా, అనూ!"

"వద్దు, బాబాయ్! దీనికి భక్తి అని పేరు పెట్టుకొని నన్ను నేను మోసం చేసుకోను. వర్షం గర్జించి, పరిసరాలు మరిచి లీనమై పోవాలి. కాని, తలుపుచప్పుడుకు ఉలిక్కిపడే పూజలో ఏమాత్రపు భక్తి, ఉంటుందో? మనకు దొరికే కొన్ని నిమిషాలు ఇంత శాంతి కోసం భక్తి అని పేరు పెట్టుకొని చెప్పుకొన్నా, వాళ్ళను మోసంచేసి, మనల్ని మనం మోసం చేసుకుంటున్నాము. ఇందులో స్వార్థ పరత కూడా ఉంది. భగవంతుడినుండి పొందాలనే ఆరాటమే కాని, ఆయన కొరకు కొన్ని నిమిషాలు కూడా త్యాగం చేయలేని మనం ఏపాటి భక్తుల మంటావు!"

ఆతను వింటున్నాడు మౌనంగా.

"బాబాయ్! మనల నందరినీ నడిపించే శక్తి ఒకటుందని

నేను నమ్ముతాను. దానికి భగవంతుడు అని పేరు పెడితే నాకు అభ్యంతరం లేదు. కాని, బాబాయ్, నేను నమ్మే సత్యం లోనే నేనింకా లీనం కాలేక పోతున్నాను. చెప్పు, బాబాయ్ ఎవరిలో వుందీ ఈ లోపం!"

అతను జవాబు చెప్పలేదు. ఇంకొకరోజు అతనికి ఎదురుగా వచ్చి కూర్చుంది అనుపమ.

"కొందరిని చూస్తే ప్రేమించబుద్ధేస్తుంది. కొందరిని చూస్తే ద్వేషించబుద్ధేస్తుంది. కాని నువ్వు ప్రేమించే వాళ్ళు మంచి వాళ్ళు, ద్వేషించే వాళ్ళు చెడ్డ వాళ్ళు కాదు. ఇలాంటి భావాలు ఎలా కలుగుతాయి, బాబయ్!"

"ఈ ప్రశ్నకు కూడా నా దగ్గర జవాబు సిద్ధంగా లేదు తల్లీ!" నిట్టూర్చాడతను.

'ఈ విశాలమైన ప్రపంచంలో ప్రతిఒక్కరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలనూ తాను మోయాలని ప్రయత్నించి మానసికంగానూ, శారీరకంగానూ కూడా నీరసించి పోయింది అనుపమ.'

ఆమె జ్ఞాన నేత్రం పూర్తిగా జ్యోతిర్మయ మవక మునుపే, విశిష్టమూ, అద్భుతమూ అయిన వ్యక్తిత్వం కల ఆ మనిషి అదృశ్యమైపోయింది. అంతవరకూ ఆమె అదృష్టవంతురాలే!

పదిహేను సంవత్సరాలు నిండకుండగానే అతి తెలి

కగా ఆమె మాతృమూర్తి అయింది. కానీ రెండు సంవత్స రాల తరవాత ఈనాడు తన భావావేశపు ప్రసవ వేదనలో మాత్రం స్పృహ కోల్పోయిందామె. అందులోనుండి కోలు కోకుండగానే తన ప్రయాణాన్ని మధ్యలోనే మలుపు తిప్పి దూరతీరాల కేసి సాగిపోయింది.

మృత్యుద్వారం ముంగిట నిల్చొని అర్థించిందింది అను పమ, తన బిడ్డను అతని చేతుల్లో ఉంచి,

"దీనిని నాను వారసురాలిని చేయకు బాబూ!"

ఆమె కళ్ళ నిండుగా వాత్సల్యం. తాను పోగొట్టు కున్న శాంతిని తన నెత్తురు గుడ్డుకయినా ఇవ్వాలని ఆరాటం.

అతని కళ్ళగుండా అవిరామంగా జారిపోతున్న నీళ్ళను తుడుస్తూ అంది.

"నువ్వు పుట్టినప్పుడు నేనులేను. నువ్వు ... యేనాటి నేనుఉండను.

ఈ నాలుగునాళ్ళ పంచయానికి కన్నీళ్ళు కారుస్తు న్నావా?"

"అనూతల్లీ!" అమెను పెనవైచుకొని బావురు మన్నా డతను.

ఆమె కళ్ళలో తడిలేదు. ఎండిన పెదవుల మీద బల వంతంగా చిరునవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పిం దామె.

"బాబాయ్! ఇప్పుడనిపిస్తోంది—విద్యార్థిగా ఫస్టుఫారంలో నాన్నగారు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు ఒక్క నెల పరిచయస్థులని విడిచి పోవడానికి ఎందుకంత ఏడ్చానా? అని. ఈనాడు నా ప్రియ బంధువుల నందరినీ శాశ్వతంగా విడిచి వెళ్ళిపోవాల్సి వుంటుందని తెలిసి వుంటే, ఆ కన్నీళ్ళను ఈనాటికి దాచుకుని వుండేదాన్ని."

"అనూ, ఇంత తొందరగా వెళ్ళిపోకు తల్లీ! ఈ ముసలివాడికి తోడెవరమ్మా!"

ఆమె సర్వస్వాన్నీ కోల్పోతున్న అతను పూర్తిగా ముసలివాడై పోయాడు.

"బాబాయ్!" అతని కళ్ళల్లోకి ప్రేమగా, వాత్సల్యంగా అదే పనిగా చూస్తోందామె.

ఆమె గాజు కళ్ళల్లో చిన్న నీటిపొర.

"నాకూ వెళ్ళాలని లేదు. కాని పిలుపు వచ్చింది, బాబాయ్!" తనకు సమీపిస్తున్న క్షణాలలో మృత్యుదేవత వాన ముందని ఆమెకు తెలుసు.

"భగవంతుడా! ఎంత అన్యాయం! నీ దగ్గరకు రావాలని లేని ప్రాణాన్ని నువ్వేం చేసుకుంటావు? నన్ను వదిలెయ్యి." అతను మూర్ఛపోయాడు. స్మృతి తప్పిన అతని చేతిలో ఆమె చెయ్యి చైతన్య రహితమై పోయింది.

అందరినీ దుఃఖసాగరంలో ముంచి, ఆమె ఆలోచనా రహితమైన ప్రపంచంలోకి జారిపోయింది. తన మధురమైన జీవితాన్ని అర్థం లేని ఆలోచనలకు, ఎడతెగని పిపాసకు బలి పెట్టుకుంది. జిజ్ఞాసతో మనసును కాల్చుకుంటూ తన జీవిత కాలాన్ని కుంచించుకుందామె.

]—o—[